## వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణం



పూజల్లో పాల్గొన్న సురేఖ, ఉప్పలయ్య, నల్ల శంకర్

మంచిర్యాలటౌన్, మే 26 : నల్లకోటమ్మ, లక్ష్మయ్య మెమోరియల్ ట్రస్టు చైర్మన్, 13వ వార్డు కౌన్సిలర్ నల్ల శంకర్ ఆధ్వర్యంలో హమాలీవాడలోని శ్రీభక్తాంజనేయ, సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా పారాయణం (108 సార్లు) వేడుక వైభవంగా కొనసాగింది. ఆలయ అర్చకులు సంగర్స్ సంతోష్ శర్మ నేతృత్వంలో నిర్వహించిన ఈ హనుమాన్ చాలీసా పారాయణంలో ఆదివారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ట్రస్టు ఆధ్వర్యంలో హనుమాన్ స్వాములకు భిక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ నల్ల శంకర్, సభ్యులు విజయ్, తోట మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, మే 26 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 ఏళ్ల నుంచి 14 ఏళ్లలోపు గల బధిర బాలబాలికలకు ప్రవేశాలు కల్పించనున్నట్లు, 1 నుంచి 6వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో, 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మాధ్యమంలో బోధనా తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత విద్య, భోజనం, వసతి సౌకర్యాలతోపాటు పాఠ్య, నోటు పుస్తకాలు, పాఠశాల ఏకరూపక దుస్తులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని బధిర విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, టీసీ, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు కలిపి శాతావాహన విశ్వవిద్యాలయానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ బధిరుల పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు 9000013639, 9000221301, 9666868755 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



భీమారం మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ వెనకాల ఐదు ఎకరాల్లో వెలసిన అక్రమ వెంచర్



పొలంపల్లి గ్రామ శివారులోని అక్రమ వెంచర్

# అక్రమాల చంద్రుడిని అడ్డుకునే దెవ్వరు?!

### భీమారం, పొలంపల్లిలో అక్రమ వెంచర్లు చేసి అమ్మకాలు

- డీటీసీపీ తీసుకోకుండానే ప్లాట్లు
- పంచాయతీ కార్యదర్శులు నోటీసులిచ్చినా పట్టించుకోని వైనం
- ఏ ఉన్నతాధికారి ఏం చేయలేడు.. అవసరమైతే ఎమ్మెల్యేతో చెప్పిస్తానంటూ దబాయింపు
- ఎకరం నాలా కన్వర్షన్ చేసి నాలుగెకరాల్లో రిజిస్ట్రేషన్లు
- ముడుపులిచ్చి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పించిన ఘనుడు
- సర్కారు ఆదాయానికి గండి

మంచిర్యాల, మే 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆయన భారతదేశంలోనే ప్రఖ్యాతిగాంచిన రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు. ప్రభుత్వానికి.. డెవలపర్స్‌కు మధ్య వారధిగా ఉండి పని చేయాల్సిన బాధ్యతను విస్మరించి అక్రమాలకు తెరలేపాడు. భీమారం మండల కేంద్రంతో పాటు పక్కనున్న పొలంపల్లి గ్రామంలో అక్రమ వెంచర్లు వేసి ప్లాట్లు అమ్మేస్తున్నాడు. నిబంధనల ప్రకారం డీటీసీపీకి వెళ్తే తప్ప ప్లాట్లు అమ్మడానికి వీలుపడదు. కానీ, ఈ వెంచర్లకు ఎలాంటి పర్మిషన్లు లేవు. డీటీసీపీ తీసుకోకుండా వెంచర్ ఎందుకు చేస్తున్నారంటూ అడగడానికి వెళ్తే 'ఏం జరిగినా నేను చూసుకుంటా.. ఏ ఉన్నతాధికారి నన్ను ఏం చేయలేడు.. నా బ్యాక్‌గ్రౌండ్ ఏమిటో తెలుసు కదా.. అవసరమైతే ఎమ్మెల్యేతో చెప్పిస్తా' అని దబాయిస్తున్నాడని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. నిబంధనల ప్రకారం డీటీసీపీకి వెళ్లండంటే.. పక్కనున్న జైపూర్ మండలంలో వందల ఎకరాలు అక్రమంగా ప్లాట్లు చేసి అమ్మేస్తున్నరు. నా సొంత మండలంలో ఎందుకు చేయరంటూ రివర్స్ మాట్లాడుతున్నారని.. ఎమ్మెల్యే పేరు చెబుతుండడంతో ఏం చేయాలో తెలియక మిన్నకుండి పోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇలా క్షేత్రస్థాయి అధికారులను కీలు బొమ్మలు చేసి ఆడిస్తూ.. సర్కారు ఖజానాకు రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నాడు.

### నాలా కన్వర్షన్ చేసి రిజిస్ట్రేషన్లు..

డీటీసీపీ లే–అవుట్‌కి పోకుండా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలు లేదు. కానీ ఇక్కడే అక్రమాల చంద్రుడు తన తెలిపితేటలను ప్రదర్శించాడు. భీమారం మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వెనుకాల సర్వే నంబర్‌లోని 634 ఐదు ఎకరాల్లో ప్లాటింగ్ చేశాడు. దాదాపు 79 ప్లాట్‌లకు 20 ఫీట్ల రోడ్లు పోసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాడు. హైవే పక్కనే ఉన్న భూమి కావడంతో మార్కెటింగ్‌కు కూడా ఇబ్బందుల్లేకుండా పోయాయి. కానీ డీటీసీపీ లేకుండా రిజిస్ట్రేషన్ చేయరని, ఐదు ఎకరాల్లో ఒక ఎకరం నాలా కన్వర్షన్ చేయించాడు. దీంతో వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా మారింది. నాలా కన్వర్షన్ చేయడంతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్లు చేయడం సులభమైంది. రిజిస్ట్రేషన్ ఆఫీసులో కొందరు అధికారులకు ముడుపులిచ్చి ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేయించాడు. అలా 79 ప్లాట్‌లలో 30కి పైగా ప్లాట్‌లను ఇతరులకు విక్రయించి రిజిస్ట్రేషన్లు సైతం చేయించినట్లు తెలుస్తున్నది. నాలా కన్వర్షన్ చేయించడంతో టెక్నికల్‌గా ఎలాంటి అనుమానాలు రాలేదని, అందుకే రిజిస్ట్రేషన్ చేశామంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఇలా ఉన్న చిన్నపాటి లూప్‌హోల్‌ను అడ్డంపెట్టుకొని అధికారులనే బురిడి కొట్టించి దందా చేస్తున్నాడు. భీమారం మండల కేంద్రంతో పాటు పక్కనున్న పొలంపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 20లో మూడు ఎకరాల 13 గుంటల్లో ఇల్లీగల్ వెంచర్‌ను ఏర్పాటు చేశాడు. దాదాపు ఇందులో 42 ప్లాట్‌లను ఏర్పాటు చేశాడు. అనుమతులు తీసుకోవాలంటూ పంచాయతీ అధికారులు వెళ్లినప్పుడు ఇక్కడ కూడా నేను చూసుకుంటా అంటూ స్పష్టం చేశాడు. గ్రామ పంచాయతీకి ఇక్కడ కొంత స్థలం కూడా ఇస్తానని డెవలప్‌మెంట్ కింద చూపించుకోండంటూ గ్రామస్తులు, అధికారులకు కల్లిబొల్లి కబుర్లు చెప్పాడు. ప్లాటింగ్‌వేసి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు.. రేపో, మాపో రిజిస్ట్రేషన్లు చేసేందుకు సైతం సిద్ధం అవుతున్నాడు. మరి ఇప్పటికైనా అక్రమాల చంద్రుడి పై జిల్లా ఉన్నతాధికారుల కన్ను పడుతుందా.. లేదా ఆయనకున్న పలుకుబడిని చూసి అధికారులు సైతం మిన్నకుండి పోతారా అన్నది వేచి చూడాల్సి ఉంది.

### నోటీసులిచ్చినా పట్టించుకోవడం లేదు : భీమారం, పొలంపల్లి పంచాయతీ కార్యదర్శులు

ఇల్లీగల్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని తెలిసి మేము వెళ్లి నోటీసులు ఇచ్చాం. పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి అన్ని అనుమతులు తీసుకోవాలని, లేని పక్షంలో మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం. కానీ ఆయన మాతో పక్కనున్న జైపూర్ మండలంలో వందల ఎకరాల ఇల్లీగల్ వెంచర్లు చేస్తున్నారు. మన మండలంలో ఎందుకు చేయకూడదు. అవసరమైతే నేను ఎమ్మెల్యేతో ఉన్నతాధికారులు చెప్పిస్తా. ఎవ్వరితోనూ ఇబ్బందులు ఉండవని చెబుతున్నాడు. ఈ లేఅవుట్లైతే చట్ట విరుద్ధంగానే ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

## ఈత.. మృత్యువాత

- పల్లెల్లో పొంచి ఉన్న మృత్యుకుహరాలు
- సరదా వెనుక పెను విషాదం
- ఈ ఏడాది పలుచోట్ల ఆరుగురు మృత్యువాత
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న నిపుణులు



తానిమడుగు డెలివరీ పాయింట్ వద్ద ఈతకొడుతున్న యువకులు



తానిమడుగు డెలివరీ పాయింట్ వద్ద మృతిచెందిన యువకుడు (ఫైల్)

దండేపల్లి, మే 26 : భానుడు భగభగ మండుతున్నాడు. చల్లదనం కోసం పిల్లలతో పాటు పెద్దలూ తహతహలాడుతున్నారు. చెరువులు, కుంటలు, బావులు, కాలువలను ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. సరదాగా ఈతకోసం వెళ్లి మృత్యువాత పడుతూ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. నీటిలోతు, ప్రవాహాన్ని అంచనా వేయలేక అందులోకి దిగుతూ విగత జీవుల్లా మారుతున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకం ఉండగా, వేసవి సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### జాగ్రత్తలు లేకే ప్రమాదాలు...

వేసవి సెలవుల్లో ప్రమాదాలు అనేకం జరుగుతాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల పిల్లలు సరియైన జాగ్రత్తలు తీసుకోకుండానే ఈతకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతుంటారు. వచ్చీ..రాని ఈతతో బావులు, కుంటలు, కాల్వల్లోకి దిగి.. తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతుంటారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన గోపులపురం కార్తిక్(18) హోలీ పండుగ రోజు తానిమడుగు డెలివరీ పాయింట్ వద్ద నీట మునిగి మృతిచెందాడు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సాత్విక్ భీంసరి వాగులో స్నానం చేస్తుండగా మృత్యువాతపడ్డాడు. కుమ్రం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం నదీమాబాద్ తాటిపల్లి గ్రామం వద్ద పెన్‌గంగ నదిలో స్నానానికి దిగిన ఆలం సాయి(23), ఉప్పుల సంతోష్(23), ఎల్మూరే ప్రవీణ్(24), పనస కమలాకర్(24) ఈత రాక మృతి చెందారు.ఈ నెల19న కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బుద్దిపెల్లి గ్రామానికి చెందిన దుర్గం కీర్తన్‌గౌడ్(24) హనుమాన్ మాల ధరించడానికి స్నేహితులతో కలిసి వచ్చి, గూడెం గోదావరిలో పుణ్యస్నానం ఆచరించడానికి దిగాడు. ఈత రాకపోవడంతో మృత్యువాతపడ్డాడు.

### ఇవి పాటించాల్సిందే...

ఈత పూర్తిగా వచ్చిన వారి సహకారంతో లోతు తక్కువగా ఉన్న ప్రదేశంలో మాత్రమే ఈత నేర్చుకోవాలి. ఈత రాని వారు తప్పనిసరిగా స్విమ్మింగ్ జాకెట్లు ధరించాలి. గ్రామీణ ప్రాంతాల్లో వీటి సౌకర్యం ఉండవు కాబట్టి తుంగ, జీలుగ బెండ్లను కట్టగా చేసుకొని వీపుకు కట్టుకొని నీటిలోకి దిగాలి. ద్విచక్రవాహనాల ట్యూబ్‌లలో గాలి నింపుకొని శిక్షణ పొందవచ్చు. చెరువులు, కాలువల్లో మట్టి కోసం తీసిన గోతులు ఉంటాయి కాబట్టి వాటి ల్లో అస్సలు దిగకూడదు. చెరువుల్లో చేపల కోసం అమర్చిన వలలు ఉంటాయి. అందులో కూడా చిక్కుకునే ప్రమాదముంటుంది. చెరువులు, కాల్వల్లో తామర తీగలు ఉన్న ప్రాంతంలో ఈతకు అస్సలు వెళ్లకూడదు.

### కాల్వలు మరీ ప్రమాదకరం..

కాల్వల్లో నీటి ప్రవాహ వేగం గురించి అంచనా వేయలేం. అందులో ఈత వచ్చిన వారు దిగినా కొట్టుకుపోయే అవకాశముంటుంది.ఇక రాని వాళ్లు ఈతకు వెళ్లకపోవడమే మంచింది. కాల్వ గేట్ల వద్ద నీరు పైకి నిశ్చలంగా కనిపించినా కింది భాగంలో ప్రవాహం ఉధృతంగా ఉంటుంది. ఈతకు దిగకపోవడమే శ్రేయస్కరం. పాడుబడ్డ బావుల్లోకి అస్సలు వెళ్లకూడదు. వీటి దరులు కూలిపోయే అవకాశం ఉంటుంది. అలాగే బావుల్లో కార్బన్‌డయాక్సైడ్ వ్యాపించి ఉండవచ్చు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

చెరువులు, కాలువల్లో చిక్కుకు పోయిన వ్యక్తిని గుర్తించి బయటకు తీయగానే ప్రాథమిక చికిత్స అందించాలి. గుండె కొట్టుకోకుంటే ఛాతిపై నొక్కాలి. పడుకోబెట్టి పొట్టపై మెల్లిగా నొక్కి నీళ్లను బయటకు తీయాలి. బాధితుడికి శ్వాస ఆడకపోతే నోటి ద్వారా శ్వాస అందించాలి. ఆపై వీలైనంతా త్వరగా సమీపంలోని దవాఖానకు తరలించాలితరలించాలి.



వెంకట్రావ్‌పేట్ గ్రామంలోని రహదారిపై బురదలో దిగబడ్డ లారీ

## బురదలో దిగబడ్డ లారీ..

### భారీగా ట్రాఫిక్ జామ్

సిర్పూర్(టీ), మే 26 : వెంకట్రావ్‌పేట్ గ్రామంలోని ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఓ భారీ లారీ బురదలో దిగబడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కిలో మీటర్ మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఆపై లారీని బయటకు తీయడంతో రాకపోకలు సాగాయి. కాగా, మహారాష్ట్ర నుంచి తెలంగాణకు ఈ మార్గం గుండా నిత్యం వందలాది వాహనాలు నడస్తున్నాయని, భారీ లారీలు వెళ్లడం వల్ల రోడ్డు గుంతలమయమైందని, వర్షాలు పడితే వాహనాలు దిగబడిపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రూట్లో భారీ వాహనాలను అనుమతించవద్దని వారు కోరుతున్నారు.





వెంకట్రావ్‌పేట్‌లోని ప్రధాన రహదారిపై లారీ దిగబడడంతో నిలిచిపోయిన వాహనాలు

## అప్పుడు వాస్తు.. ఇప్పుడు ముహూర్తం!



బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇదే

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవానికి సాకులు
- మాటకు కట్టుబడి ఉండని ఎమ్మెల్యే గడ్డం వినోద్
- అధికారిక కార్యక్రమాలకు మాత్రమే హాజరు
- తమకే దొరకడం లేదంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు
- ఇంకెప్పుడు అందుబాటులో ఉంటారని పెదవి విరుస్తున్న ప్రజలు

బెల్లంపల్లి, మే 26 : బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవం ఇప్పట్లో జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. గతేడాది నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరగగా, జనవరి 3న ఫలితాలు విడుదలయ్యాయి. గెలిచిన వెంటనే కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి రావాల్సి ఉండగా, ఎమ్మెల్యే గడ్డం వినోద్ దాటవేసే ధోరణి వల్ల ఆ దిశగా అడుగులు పడడం లేదు. అప్పట్లో కార్యాలయం వాస్తు బాగాలేదని, గదులు, ఇతర విభాగాలకు మరమ్మతులు చేయాలని జాప్యం చేశారు. తీరా.. మొత్తం పూర్తయ్యాక ఇప్పుడు శుభముహూర్తాలు లేవనే సాకుతో మరో రెండు నెలలు వాయిదా వేశారు. ఆ తర్వాతైనా ప్రారంభిస్తారా, లేక మరే ఇతర కారణమేదైనా చూపించి జాప్యం చేస్తారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇలాగైతే సామాన్య ప్రజానీకానికి ఇంకెప్పుడు అందుబాటులో ఉంటారని, తమ సమస్యలు ఎవ్వరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే మంచి రోజు చూసుకొని సీనియర్ పురోహితుల సూచన మేరకు కార్యాలయాన్ని ప్రారంభిస్తానని, అప్పటి వరకు వారంలో రెండు రోజులు బెల్లంపల్లి ప్రజలకు అందుబాటులో ఉంటానని శనివారం విలేకరుల సమావేశంలో తెలిపిన విషయం విదితమే. కనీసం ఈ మాటకైనా కట్టుబడి ఉంటారా లేదా అని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ప్రచారంలో భాగంగా గెలిచిన తర్వాత స్థానికంగా ఉంటానని సుభాష్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం ముందు బాండ్ రిలీజ్ చేసిన వినోద్.. ఇప్పుడా విషయంపై నోరు మెదపకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే అడపాదడపా అధికారిక కార్యక్రమాలకు బెల్లంపల్లికి వచ్చినప్పుడు ఆయనను కలిసి సమస్యలు విన్నవించుకుందామంటే.. తమకే దొరకండలేదని కాంగ్రెస్ కార్యకర్తలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇక సామాన్య ప్రజానీకం పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా దాటవేసే ధోరణికి స్వస్తి పలికి బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ రడగంబాలబస్తీలోని ఆయన నివాసంలో ప్రతిరోజూ అందుబాటులో ఉండాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

## వెంచర్‌కు అడ్డుగా ఉందని శిలాఫలకం కూల్చివేత



కూల్చిన శిలాఫలకం

హాజీపూర్, మే 26 : హాజీపూర్ మండలం దొనబండ గ్రామ శివారులోని శిలాఫలకాన్ని ఇటీవల కూల్చి వేశారు. 2023 అక్టోబర్ 7న పడ్తన్‌పల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న ఎత్తిపోతల పథకానికి అప్పటి నీటి పారుదల మంత్రి తన్నీరు హరీశ్‌రావు దొనబండ గ్రామ శివారులో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇటీవల ఆ ప్రాంతంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంచర్‌ను ఏర్పాటు చేసి కంచె వేశాడు. అయితే తన వెంచర్‌కు అడ్డుగా శిలాఫలకం ఉందని కూల్చివేశాడు. ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్‌ను ఏర్పాటు చేయడమేగాకుండా శిలాఫలకాన్ని కూల్చి వేయడం ఏమిటని ప్రజలు మండిపడుతున్నారు.

## వైభవంగా భీరన్నస్వామి బోనాలు



బోనాలతో భీరన్న ఆలయానికి తరలివస్తున్న మహిళలు

సీసీసీ నస్పూర్, మే 26: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపల్లి గ్రామంలో భీరన్న స్వామి బోనాల ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 22న ప్రారంభమైన ఈ ఉత్సవాలు వారం పాటు నిర్వహించనున్నారు. ఆదివారం భీరన్న ఆలయానికి గొల్లకుర్మలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంప్రదాయ నృత్యాలతో హోరెత్తించారు. బోనాలతో వచ్చిన మహిళలు ఆలయం వద్ద పట్నాలు వేసి, స్వామి వారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం వద్ద ఒగ్గు పూజారులు కల్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాకారులు ఒగ్గు కథ చెప్పారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు ఉన్నారు.

## రాజ్యాంగ హక్కులు సమానంగా అందాలి

### ఎం-21 జాతీయ కమిటీ సభ్యుడు ప్రేమ్‌కుమార్





పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

సీసీసీ, నస్పూర్ 25 : రాజ్యాంగ హక్కులు అందరికీ సమానంగా అందాలని మూవ్‌మెంట్–21 జాతీయ కమిటీ సభ్యుడు ఎన్ ప్రేమకుమార్ పేర్కొన్నారు. ఆదివారం నస్పూర్‌లో ఎం–21 డిగ్నిటీ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఎం–21 ఉద్యమం సమష్టిగా కొనసాగుతుందన్నారు. గ్రామ, పట్టణ, నగరాల్లో ఎం–21 ఉద్యమం అంబేద్కర్ భావజాలంతో కొనసాగుతుందన్నారు. బడుగు, బలహీన, దళిత, గిరిజన ప్రజలకు రాజ్యాంగ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ఎం–21 ఉద్యమం మొదలయ్యిందన్నారు. అనంతరం ఎం–21 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఫెస్ట్‌లో ఎం–21 సభ్యులు ఆటా పాటలతో ఉత్సాహంగా గడిపారు. మూఢ నమ్మకాల నిర్మూలనలపై నిర్వహించిన ఉమా మ్యాజిక్ షో ఆకట్టుకున్నది. కస్తూరి కళాకారిని నృత్యం ఆకట్టుకుంది.